తోశాడు, గోపాలరావు. విధిలేక వెళ్ళి కూచున్నాను. వాడుకూడా, నా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. వాడు రావడంతోనే ఆ పిల్ల కొంచెం సిగ్గుపడింది.

ఏం చెయ్యడానికీ తోచక, ఆ పిల్లవైపు తిరిగి "వీడు, నా స్నేహితుడు గోపాలరావు. రాత్రి మన ఇంట్లోనే భోజనం చేస్తాడు!" అనేశాను.

గోపాలరావు తెల్లబోయి నావైపు చూశాడు. మా ఆవిడ మాత్రం సరే నన్నట్టు తలవూపింది.

# వ్యాపారి హృదయం

'యారికో ఒక రెడ్ ఇండియను నాయకుని కూతురు. ఆజాతి స్త్రీలలో ఆమె చాలా చక్కనిది. నాభిదగ్గరనుంచి మోకాళ్ళవరకూ, దేహాన్ని మరుగుపరచడానికి, పులిచర్మాన్ని మొలకుచుట్టుకొనేది, యారికో తలమీద, రత్నాలూ ముత్యపుచిప్పలూ కలిపికట్టి మేలుజాతి నిప్పుకోడి ఈకలుగుచ్చిన కిరీటం-కిరీటంకన్న యింకొక పేరు దానికేమీ తోచడం లేదు-పెట్టుకొనేది. రెండుచేతులకీ, అంగుళం వెడల్పుఉన్న దంతపు మురుగులూ, మెడలో దంతపు పలకలహారమూ-దంతపు పలకలమధ్య రత్నాలు తాపటము చేసి-ధరించేది. కాళ్ళకు ముత్యపు చిప్పలుకట్టిన దంతపు కడియాలు వేసుకొనేది. పొడుగైన ఆమెజుట్టూ, నీలపురాళ్ళలాగ మెరిసేకళ్లూ, ఎర్రని శరీరపురంగూ, పద్ధెనిమిదేళ్ల పాలుగారే యౌవనమూ-ఆజాతిలో అందచందాలెరిగిన యువకులందరినీ ఆకర్షించాయి. ఎంతోమంది, ఇతర నాయకులు ఆమెను వరించారు. యారికో ఒక్కడినీ మెచ్చుకోలేదు. తనకుమార్తె అందానికి అంతమంది సాటివారు మురియడమూ, వాళ్లలో ఒక్కడినీ ఆమె వరించకపోవడమూ, వాళ్లంతా పదేపదే తనమెప్పుకోసం ప్రయత్నించడమూ, చూసి అమితంగా గర్వపడేవాడు యారికో తండ్రి. యారికో ఎప్పుడూ

పెళ్లిమాట తలపెట్టలేదు. పెళ్లిచేసుకోవాలనే భావం యింకా కలగక పోవటంచేతనే, ఆజాతిలో అందగాళ్లనీ, వీరాధివీరులనీ పేరుపొందిన యువకుల్నికూడా ఆమె మెచ్చుకోలేదు. ఆమెహృదయం ప్రేమా, వివాహము అనేవి తెలుసుకొనేటప్పటికి ఎవడు ఆమెను ప్రేమిస్తాడో, వాడినే ఆమె పెళ్లిచేసుకుంటుందని యారికో తండ్రి ఆమె పెళ్లి విషయం తీవ్రంగా ఆలోచించలేదు.

యారికో వయసు యౌవన ప్రాదుర్భావంలో వుంది. మార్పు చెంది, పొందికతో మిసమిస లాడుతూవున్న ఆమెరూపము కన్నులకీ, మనస్సుకీ యెంతో యింపుగా వుంది. ఆమెతండ్రిపదవికన్న, ఆమెరూపమే ఆమెకు యెక్కువ గౌరవాన్ని కలిగించింది సాటివారిలో.

రెడ్ ఇండియనులకు విలువిద్య ప్రాణసమానము. వారిలో స్త్రీపురుషులంతా యీవిద్యను శ్రద్ధగా అభ్యసిస్తారు. యారికో విలువిద్యలో ప్రవీణురాలు. అప్పుడప్పుడు అడవులలో వేటాడుతూ వొంటరిగా తిరగడం యారికో అలవాటు.

ఓరోజున, మధ్యాహ్నపువేళ, విల్లు భుజాన తగుల్చుకొని, అమ్ములపొది నడుమున కట్టుకొని, అడవిలో తిరగడానికి బయలుదేరింది యారికో. తిరిగి తిరిగి, ఏడెనిమిది పిట్టల్ని వేటాడి, నడుమున కట్టుకొని, ఇంటికి పోవడానికి వెనకకు మళ్ళింది.

ఆ అడవులలో యారికో యెరుగని దారిలేదు. ఈసారి, వచ్చిన దారిన కాకుండా, ఇంకొక దారిన యింటికి పోతోంది యారికో. చిన్నకొండనుచుట్టి సముద్రపు వొడ్డుమీదుగా రెండుమైళ్ళునడిస్తే వాళ్లగూడెం చేరుతుంది.

సన్ననిగొంతుతో పాడుకుంటూ, మెల్లిగా అడుగులువేస్తూ, కొండదారిలో నడుస్తోంది. ఇంకొక అరఘర్లాంగు నడిస్తే, సముద్రపువొడ్డు చేరుతుంది. అక్కడికివచ్చి, యారికో నాలుగువైపులా చూసింది.

ఇరవైగజాల దూరాన, ఏదో వింతగా కనపడింది. అమెకి అదేమిటో చూదామని కుతూహలం కలిగింది. ముందే జాగ్రత్తతో విల్లెక్కుపెట్టి,

సంశయంతో అడుగులు వేస్తూ, ఆ వింత వస్తువుదగ్గరకు వెళ్ళింది. ఆ వస్తువు ఆమెకు మనిషి పోలికలో కనపడింది. చేతులో వున్న విల్లు నేలమీద పెట్టి, వంగి ఆశ్చర్యంతో ఆవ్యక్తి కేసి చూసింది యారికో. 'మనిషేనా, క్రొత్త మాదిరిజంతువా!', ఆమెకు తోచిన మొదటి సందేహం అది. కాళ్ళకు బూట్లు, పంట్లాము, పంట్లాము లోపలికి దోపినషర్టు, క్రాపింగుజుట్టు. తెల్లటి వొంటిరంగు, యిరవై రెండేళ్ళ వయస్సు కలిగిన ఆవ్యక్తిని అలా ఎంతోసేపు చూసింది. ఆ వ్యక్తి కదలలేదు. గుండెలమీద చెయ్యి పెట్టి చూసింది. బలహీనంగా గుండె కొట్టుకుంటోంది. యారికో ఆలోచించింది.

గబగబా, అమ్మలపాదిగా వుపయోగించే కొమ్ముబుర్రతో నిండా నీళ్లు తెచ్చి, ఆవ్యక్తి మొహమ్మీద చల్లింది. ఉత్సాహముతో గొంతులో కొంచెం కొంచెంగా నీళ్ళుపోసింది యారికో. ఆవ్యక్తి కళ్లు విడిపడ్డాయి.

తను నేలమీదకూచుని, ఆవ్యక్తి తల తన తొడలమీద పెట్టుకొని, మొహంమీదనున్న జుట్టు ప్రక్కకుతీసి, వింతగా ఆవ్యక్తి శరీరము ఆ పాద మస్తకమూ చూసింది.

మీసాలూ, కొంచెంగా పెరిగిన గడ్డమూ, ఆవ్యక్తి పురుషుడనే భావం కలిగించాయి ఆమెకి. కొంచెం సేపటికి తెలివి తెచ్చుకొని, అతను లేచి కూచున్నాడు. యారికో లేచినిలబడింది. ఇద్దరూ, వొకర్ని వొకరు ఆశ్చర్యంతో చూసుకున్నారు. అతను యేదో అడిగాడు. ఆమె యేదో చెప్పింది. ఒకరి మాట యింకొకరికి అర్థంకాలేదు. ఆకలివేస్తోందని తన కడుపూ నోరూ చూపించాడు అతను. వెంటనే చెకుముకురాయికొట్టి, చుట్టుప్రక్కలవున్న చిదుగులతో మంటవేసి, తన నడుమునవున్న పక్షుల్ని కాల్చి తినమని యిచ్చింది.

ఆకలి తీర్చుకొన్న తరువాత, యారికో అడగకుండానే, అతను సైగలవల్ల తను చాలమందితో పడవలో ఆ రేవునదిగానీ, అందరూ వేటాడడానికి అడవిలో చాలదూరం వచ్చామనీ, చుట్టుప్రక్కల పొంచుని తమ నందర్నీ కనిపెట్టిన రెడ్ ఇండియనులు వెనుకనుంచి తమమీదపడ్డారనీ, తనవాళ్లకీ,

రెడ్ యిండియనులకీ యుద్ధం జరిగిందనీ, తను యేలాగో తప్పించుకొనివచ్చి అక్కడ స్పృహతప్పి పడిపోయినాననీ తెలియపరిచాడు. అతను చెప్పిన దానిలో కొంతయినా ఆమె అర్థము చేసుకున్నది. తన బంధువులు చూస్తే అతన్నికడతేర్చివేస్తారని ఆమెకు తోచింది. కర్తవ్యం ఆలోచించింది. తనతో రమ్మని అతనికి సైగజేసింది మాట్లాడకుండా యారికోను అనుసరించాడు అతను. కొండయెక్కి, వెనుకవైపుకిదిగి, కోనలోవున్న చిన్నగుహలోకి తీసికొనివెళ్ళి అక్కడ పడుకోమని సైగజేసింది.

దారితెన్నూ తెలియకా, బయటికివస్తే రెడ్ యిండియనులు పైనబడి చంపేస్తారనేభయంచేతా, ఆమెచెప్పినదానికి వొప్పుకున్నాననితలవూపాడు.

అప్పటికప్పుడే ప్రొద్దుజారింది. మళ్లా వొస్తానని సైగజేసి వెళ్ళిపోయింది యారికో.

రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు. యెక్కడపుట్టాడో, యెక్కడ పెరిగాడో, యీఅరణ్యాలలో, అటవిమనుష్యులమధ్య, తన గతియేమవుతుందా అని ఆలోచిస్తూ గడిపాడు రాత్రి. తెల్లవారింది గుహలోనుంచి బయటికి రావడానికి అతనికిభయంవేసింది. తలమీదచేతులు పెట్టుకొని, రాత్రంతా పడుకొన్న రాతిబండమీద ఆలోచిస్తూ కూచున్నాడు. మళ్లా స్వదేశానికి వెళ్ళడం సాధ్యమవుతుందా, అని అతనికి సంశయము. అందువల్ల విచారము. కొండజాతిపిల్ల తనను యిలా కాపాడడమూ, పక్షుల్ని కాల్చి ఆహారమివ్వడమూ అతనికి ఏదోవింతగావుంది. గుహగుమ్మమువైపు దృష్టినిలిపి తదేకధ్యానంతో ఆలోచిస్తున్నాడు.

బారెడు ప్రొద్దెక్కింది, రక్తం కారుతూవున్న పక్షుల్ని యేడెనిమిదింటిని త్రాడుతోకట్టి ఒకచేత్తోటీ, తాటిబుర్రతో మంచినీళ్ళు ఒకచేత్తోటీ పట్టుకొని, వొయ్యారంగా నడుస్తూవస్తూవున్న యారికో అతనికి కనిపించింది, అతడుపొందిన ఆనందానికి మేరలేదు. తనదేశీయుల్ని చూసినంతమాత్రాన, బాణాలువేసి చంపేసే యీ రెడ్ యిండియనులకన్య, తనను అంతఆదరంగా చూడటం, అతనికి ఆశ్చర్యకరంగా వుంది.

పుల్లలతో మంటచేసి పక్షుల్ని కాల్చి యిచ్చింది. తిన్నాడు. తాబేటి బుర్రతో తీసుకోని వొచ్చిన మంచినీళ్ళు యిచ్చింది; త్రాగాడు.

అతను చొక్కా సవరించుకోవడమూ జుట్టు పైకి సర్దుకోవడమూ వింతగా, అమృతం ఒలికేచూపులతో చూసింది యారికో. నిస్సహాయుడై, దారితెన్నుగానక విచారంలో మునిగివున్న అతనికి యారికోచూపే ప్రేమ కొంతవరకు మనశ్శాంతిని యిచ్చింది.

యారికోవృత్తాంతం తెలుసుకోవడానికి అతనూ, అతని సంగతి తెలుసు కోవడానికి యారికో చాలా కుతూహలంతో వున్నారు. కాని వొకరిమాట వొకరికి తెలియటంలేదు. అందుచేత అది సాధ్యంకాలేదు.

ఆమెను చూడగా చూడగా, ఆమెలోవున్న సౌందర్యమూ, తనమీద ఆమె చూపించే అపేక్షా, అతనిమనస్సును ఆకర్షించాయి. తన కృతజ్ఞత యెలా తెలియజెయ్యాలో అతనికి తోచలేదు.

ప్రతిరోజూ వేళమీరకుండా, పక్షులనో, కుందేళ్ళనో, వేటాడి, వాటినీ, తియ్యటి ఫలాలనీ, తీసికొచ్చి అతనికి ఆకలి తీర్చుకోడానికి యిస్తూవుండేది. ఆమెయందు అతనికి చాలా మంచిభావం కలిగింది. ఆమె తనను ప్రేమించిం దని అతను అవగాహన చేసుకొన్నాడు. కృత్రిమంలేనిహృదయంతో తన ప్రేమను అతనికి ఆమె కనపరుస్తోంది. దినములు గడచినకొద్దీ వారిద్దరూ ఒకర్నివొకరు అర్థం జేసుకున్నారు. ఒకరిసంగతి యింకొకరికి చెప్పుకోడా నికి వీలయ్యేభాషను వాళ్లుకల్పించుకొన్నారు. ఆమె తనసంగతి అంతా అతనికి చెప్పింది. ఎంతోమంది వరులు వెతుక్కుంటూవచ్చినా, తృణీకరిం చిన యారికో "నేను నిన్ను ప్రేమించాను" అని అతనికి, తనజీవితాన్ని, స్వా తంత్ర్యాన్ని, ఆత్మను అప్పగించింది.

ఆమెకు తనవృత్తాంతమంతా అతడు ఇలా చెప్పాడు—

అతనిపేరు థామస్ ఇంకిల్. లండనులో ఒక సామాన్యవ్యాపారస్థుని కొడుకు. చిన్నప్పటినుంచీ ఇంకిల్‌కి వ్యాపారమంటే చాలాయిష్టం. ఇండి యన్‌దీవులకి వ్యాపారంకోసం ప్రయాణముచేస్తూవున్న ఏచిలిస్ అనేఓడలో

అతనుకూడా బయలుదేరాడు. ప్రయాణమైపోతూవున్న ఓడ దురదృష్టవశాత్తూ, అమెరికాతీరానికి చేరింది. ఓడలో తినుబండారాలు అయిపోవటం వల్ల, ఒడ్డునయేమైనా దొరుకుతాయేమో అని, ఓడలోవున్న కొందరు ఓడ దిగి ఒడ్డుకివచ్చారు. వారిలో ఇంకిల్ వొకడు. ముందు వెనుకలు చూడకుండా వీళ్ళు వొడ్డునుంచి చాలాదూరంవచ్చేశారు. కొంతమంది రెడ్ యిండియనులు వీళ్ళను వెంటాడుతూవచ్చి, అకస్మాత్తుగా ఒక్కసారి మీదపడ్డారు. శత్రువులు ఎక్కువమంది ఉండటమూ, తమచేతులో ఆయుధాలు ఏమీలేక పోవడమూవల్ల, తనవాళ్ళందరినీ, రెడ్ ఇండియనులు హతమార్చివేశారు. పోట్లాట జరుగుతూవుండగానే, ఇంకిల్ మాత్రం తప్పించుకొని, చాలాదూరం నడచి ఆ కొండదగ్గిరికివచ్చి ఆయాసంతో పడిపోయాడు. తనవాళ్ళ ఓడ ఏమైందో అతనికి తెలియదు.

ఇంకిల్ చెప్పినకథంతా జాగ్రత్తగావింది' యారికో.

ఎన్నాళ్ళు అతన్ని అక్కడ దాచిపెట్టగలుగుతుంది! తమనిద్దర్నీ కనిపెట్టారంటే తనవాళ్ళు తమను నిలువునా చంపేస్తారు. ఇంకిల్ చెప్పిన గుర్తులనుపట్టి, అతను యెక్కివచ్చిన ఓడజాడ ఏమైనా తెలుస్తుందేమోనని సముద్రపు ఒడ్డున నాలుగైదుమైళ్ళ తిరిగివచ్చింది యారికో. కాని, యెక్కడా దాని జాడ కనపడలేదు.

గత్యంతరం లేనందువల్ల, దైవంమీద భారమువేసి తనజీవితం ఆ గుహలో నెగడపడానికి నిశ్చయించుకున్నాడు ఇంకిల్. ఎప్పటికేనా తనకి యీ అవస్థనుంచి విముక్తి కలుగుతుందనే ఆశమాత్రము అతనికి వదలలేదు. యారికో మాత్రం ప్రతిరోజూ, యేదైనా ఓడ కనుపిస్తుందేమోనని సముద్రపు ఒడ్డున చాలాసేపు తిరిగి వస్తూవుండేది. రాత్రివేళప్పుడు ఇంకిల్‌తో వుండడానికి యారికోకి వీలులేదు. పగలుకూడా, పదేపదే ఆగుహలోకి వెళ్లడం తనవాళ్లుయెవరేనా చూస్తే మోసంవస్తుందని చాలాజాగ్రత్తతోటి మెలగేది.

ఇంకిల్ తనను తొడలమీద కూర్చోబెట్టుకొని రెండుచేతులూ వీపుమీద పెనవేసికొని పెదిమల్ని గట్టిగా ముద్దుపెట్టుకొన్నప్పుడు ప్రపంచాన్నే మరచి

పోయేది యారికో. ఇలాటిశృంగారప్రవృత్తి తనజాతివాళ్లలో యెక్కడా ఆమెకు కనబడలేదు.

ఇంకిల్ స్వదేశాల్ని గురించిన విషయాలను అనేకంఅడిగేది యారికో. స్త్రీపురుషులవృత్తులూ, అలంకారాలూ దుస్తులూ, నాగరికతా సౌఖ్యమూ యెంతో వర్ణించిచెప్పేవాడు ఇంకిల్. అదృష్టంబాగుండి యేదైనా ఓడ దొరికినట్లయితే తనతోకూడా ఆమెను తీసుకొనిపోయి గౌనులు కుట్టించి టోపీలుకొనిపెట్టి చక్కగా తయారుచేస్తాననీ గుర్రపుబండ్లలో తిరగవచ్చుననీ యెన్నో చెప్పేవాడు ఇంకిల్. ఆవిషయాలువిన్నప్పుడల్లా బ్రహ్మానందపడిపోతూ, ఆలోచించి సుఖస్వప్నాలుకంటూ, యేదైనా ఓడను కనపడేటట్టు చెయ్యమని తన కులదేవతలకందరికీ మొక్కుతూ యెన్నోరోజులు గడిపింది యారికో. శ్రద్ధగా ఇంకిల్ దగ్గర ఇంగ్లీషు మాట్లాడడం నేర్చుకుంది. తనయింట్లో వండుకునే పదార్థాలన్నీ చాటునా మాటునా తెచ్చి ఇంకిల్ కి పెట్టేది. అవేతిని బ్రతుకుతున్నాడు ఇంకిల్.

బారెడున్నర ప్రొద్దెక్కింది. యారికో యింకా రాలేదేమా అని ఎదురు చూస్తూ కూచున్నాడు ఇంకిల్. ఆనాడు యారికో అంతసేపటిదాకా రాక పోవడం అతనికి భయంవేసింది. ఆమెజాతివాళ్ళు యెవరైనా తనసంగతి కనుక్కున్నారేమో! ఇంకాస్సేపులో గుంపులు గుంపులు వచ్చి తనని నరికేస్తారేమో! ఆరు నెలలనుంచి మరచిపోయిన అతనిప్రాణంసంగతి అతనికి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఒక్కసారిగా అతని శరీరమంతా కంపించింది. గుండెలు కొట్టుకున్నాయి, ఎప్పటికైనా, తనదేశానికి పోతానని అతనికి యీమధ్య కలిగిన ఆశ ఒక్కసారి భగ్నమయింది. తనకింక చావు తప్పదనేభయం అతనికి బాగాకలిగింది, ఎందుచేతనో—

వెనుకనుంచి మనషివస్తూవున్న మూంచరిసి [illegible] చూచి అతని నవనాడులూ క్రుంగిపోయాయి. కాని, ఆవచ్చినమనిషి—యారికో. అతనికి సగంభయం తగ్గింది.

"యారికో! ఏమిటి సంగతి? ఇంత ఆలస్యం" అన్నాడు ఆత్రంతో.

'దా, దా, వెళ్ళిపోదాం. యేదో ఓడ—'

'ఆఁ.'-సంతోషమూ, ఆశ్చర్యమూ అతన్ని ముంచివేశాయి. అతడు అంతకన్న యెక్కువ మాట్లాడలేక పోయాడు.

'లే, వెళ్ళిపోదాం. ఓడలో వాళ్ళు మనకోసం యెదురుచూస్తూవున్నారు. దూరాన్నపోతూన్న ఓడకు సైగలుచేసి పిలిచాను. ఆవోడ కేప్టెనుకి అన్ని సంగతులూ చెప్పాను. త్వరగా, రా వెళ్ళిపోదాం' అంది యూరికో. ఆమె ఆమెముఖంలో ఆనందం తాండవించింది. ఆమెపెదవులు చెలించాయి గుండెలు కొట్టుకోవడము స్పష్టంగా కనిపడుతోంది.

మూటకట్టుకోడానికి అతనికి సామానులు యేవీ లేవు. యూరికో న[illegible]క్కాలే బయలుదేరాడు. పొదలలోనుంచి, గుట్టలలోనుంచి, రెండుమూ మైళ్ళు నడిపించి, సముద్రపు ఒడ్డుకి తీసుకొనివెళింది. సముద్రములో ఊగుతూవున్న ఓడను చూడగానే, అతనిగుండెవూగింది. వీళ్ళిద్దరూ ఒడ్డుదగ్గర తమకోసం నిరీక్షిస్తూవున్న చిన్న పడవయెక్కి ఓడలోకివెళ్లారు. ఓడకేప్టెను మర్యాదతో ఇంకిల్ కి స్వాగతము చెప్పాడు. ఓడ అమెరికాతీరంనుంచి మళ్లింది.

ఇంకిల్ స్వదేశానికి దగ్గిరైనకొద్దీ, యూరికో స్వదేశానికి దూరమైపోతోంది. ఓడలో యెక్కినక్షణంలోనే స్వాతంత్ర్యవాయువు పీల్చాడు యింకిల్. తన స్వాతంత్ర్యాన్ని కోలుపోయింది యూరికో.

యూరికో మెడలోవున్న రత్నాల్లో ఒకదానిని కెప్టెను చేతిలో పెట్టాడు ఇంకిల్.

అతనికీ, యూరికోకీ దుస్తులూ తిండీ, యివ్వగా కెప్టెను నాలుగేళ్ళు భుక్తి గడపగల ఖరీదు ఆరత్నము ఒక్కటే చేస్తుంది.

ఇంగ్లీషు స్త్రీదుస్తులలో యూరికో సానబెట్టిన రత్నంలా తయారయింది. ఆమె శరీరంమీదనున్న అమూల్యరత్నాలన్నీ యింకిల్ దాచిపెట్టుకున్నాడు.

ఆరు నెలలనించి అణగిపోయిన వ్యాపారచింత అతనిలో మళ్లీ హటాత్తుగా

ఉద్భవించింది. అమూల్యమైన ఆరునెలలకాలం వృధాగా గడిపివేశానని అతను విచారించాడు. చావుతప్పి బ్రతికానన్నమాట, ఆ ఓడలో కాలుపెట్టిన మరుక్షణమే మరచిపోయాడు ఇంకిల్. ఆరునెలలు సక్రమంగా వ్యాపారం చేస్తే యెంతడబ్బు సంపాదించవచ్చును ? అంతా యిప్పుడుకావాలి. లేక పోతే లండనులో కాలుపెట్టడం సిగ్గుచేటు. ఇన్నీ ఆలోచించినా, యారికో దగ్గరనుంచి తీసుకొని దాచిపెట్టుకున్న రత్నాలు కొన్ని వేలపౌనుల ఖరీదు ఉంటాయన్నమాట అతను తలపెట్టలేదు. ఇంకా డబ్బుకావాలి.

వ్యాపారచింతలో మునిగివున్న యింకిల్ కి యింకో బాధకూడా ఆరంభ మయింది. హీదన్ (క్రిస్టియనుకాని) మతమునకు చెందిన, అనాగరికపు జాతి పిల్లను ప్రేమించాడనీ, ఆమెను పెళ్ళి చేసుకోబోతున్నాడనీ, ఆ ఓడలో వున్నవాళ్ళు యింకిలునుగురించి గుసగుస లాడుకుంటున్నారు. రెండుమూడు సార్లు ఆ ప్రసంగం చెవులార ఇంకిల్ విన్నాడుకూడాను. అతనికి యేమీ పాలుపోలేదు. అవమానమూ, ధనకాంక్షా అతనికి యెక్కువై పోయాయి. ఆలోచించాడు. దారి కనపడలేదు.

'మనం లండన్ ఎప్పటికి చేరగలము ?' అని ఓడ పైభాగమువీద తన ప్రక్కనకూర్చున్న సాటిప్రయాణికుణ్ణి అడిగాడు ఇంకిల్.

'నేను లండనురాను' అన్నాడు ఆ ప్రయాణికుడు.

'అయితే...'

మాది బార్బడోస్. ఈ ఓడ బార్బడోస్ కువెళ్లి తరువాత లండను వెడు తుంది. నేను బార్బడోస్ లో వ్యాపారస్థుణ్ణి.

'ఏం వ్యాపారం ?'

ప్రయాణీకుడు కొంచెం సంకోచించాడు. జవాబుకోసం ఇంకిల్ అతని ముఖం చూశాడు.

'బార్బడోస్ బానిసవ్యాపారానికి ప్రసిద్ధికెక్కిన ప్రదేశము. నేను బానిసలనుకొని మారుబేరానికి అమ్ముకొంటాను.'

ఇంకిల్ అదిరిపడ్డాడు.

తళుక్కుని అతని తలలో యేదో ఆలోచన మెరిసింది. మాట అని ఆ వ్యాపారస్థుణ్ణి తనగదిలోకి తీసికెళ్లాడు.

గంటసేపయిన తరువాత, ఆ వర్తకుడు, ఇంకిల్ గదిలోనుంచి బయటికి వచ్చి యారికో, గదిలోకి వెళ్లాడు. యారికో మర్యాదగా అతన్ని వచ్చిన పనేమిటి అని అడిగింది.

'నిన్ను తీసుకొని పోవడానికి.'

'నన్నా, ఎక్కడికి, ఎందుకు?'

'నిన్ను నేను కొన్నాను. ఇదిగో ఇంకిల్ వ్రాసియిచ్చిన సమ్మతి. నూరు పౌనులు నీకోసం అతనికి యిచ్చాను, నేను బానిసవ్యాపారం చేస్తాను.'

యారికో తల దిమ్మెరపోయింది. తనను నూరుపౌనులకోసం యింకిల్ అమ్మేశాడా! తను బానిసా!!

'ఇంకిల్ తో మాట్లాడవచ్చా? అని అడిగింది, ఆమెకళ్లు చెమర్చాయి.

'అది నాయిష్టంమీద ఆధారపడివుంది. అయినా, ఒక్కసారికి అనుమతి యిస్తున్నాను.' పెద్దపెద్ద అడుగులువేసుకుంటూ యారికో ఇంకిల్ గదికి వెళ్లింది. కౌగలించుకోబోయింది. తోసేశాడు ఇంకిల్.

'ఇంకిల్, ఇంకిల్ అమ్మేశావా నన్ను? నన్ను ప్రేమించలేదూ నువ్వు?' అని అడిగింది: కళ్లవెంబడి నీళ్ళుకారాయి. ఆమె మొహంవైపైనా చూడలేదు ఇంకిల్.

'ఇంకిలు ఆరునెల్లు మరిచిపోయినా! చూడూ, నేను చూలుతో వున్నాను కూడాను—'

ఆ యింగ్లీషు యువకునితలలో వ్యాపారచింత యింకా ఎక్కువగా పని చేసింది. తలయెత్తకుండా, నా అభిప్రాయం 'నేను మార్చుకోను' అంటూ తనగదిలోవున్న వ్యాపారస్థుని దగ్గరకు వెళ్లాడు.

'ఏమిటి సంగతి?' అన్నాడు వర్తకుడు.

'ఆమె గర్భంతోవుంది, అంటే రెండు ప్రాణాలన్నమాట. ఇంకో యాభై పౌనులు ఎక్కువయివ్వాలి. లేకపోతే బేరం వొప్పుకోను'అన్నాడు ఇంకల్.

కథా నిలయం
961

ఆలోచిస్తున్నాడు వర్తకుడు.

ఓడలో గందరగోళమూ కేకలూ విబడ్డాయి ఇద్దరూ బైటికి వచ్చారు.

‘మనిషి నీళ్లలో పడిపోయింది. రెండుసార్లు తేలి మునిగిపోయింది, చచ్చిపోయిందన్నమాటే’ అన్నారు ఓడవాళ్లు.

‘ఎవరు? ఎవరు?’ అన్నాడు ఇంకిల్ ఆత్రంతో.

‘మీతో వచ్చిన ఆ రెడ్ ఇండియన్.’

‘అరే, ఎంత చక్కని పిల్ల! పాపం! అని జాలిపడ్డాడు బానిస వ్యాపారస్థుడు.

‘దేవుడా! నూటయాభై పౌనులు పోయినట్టే—’ అని విచారించాడు ఇంకిల్.

(ఒక ఇంగ్లీషు కథను అనుసరించి)

# బహుమానం

ప్రపంచంలో మరే రాజుకీ లభ్యంకాని కీర్తి సంపాదించాడు ఆ రాజు. అది శాశ్వతమైన కీర్తి. ఎన్నో దేశాలనుంచి, ఎంతోమంది యాత్రికులు వస్తారు. ఆ దేవాలయాన్ని చూస్తారు. ఆ గోపురాలను చూస్తారు. అబ్బా! అని విస్తుపోతారు. మళ్ళీ తమ దేశాలకపోతూ, ఆ రాజు కీర్తిని తమ దేశాలకు మోసుకుపోతారు.

అసలు ఆ ఆలయాన్నీ, అ గోపురాలనూ మొట్టమొదటిసారి తెరలు విప్పినప్పుడు చూడడానిక ఎన్నో దేశాలనుంచి వేలకొలదిగావచ్చారు ప్రేక్షకులు ఆ శిల్పి అలాటివాడు. అతనికీర్తి అంతకుముందే ఎన్నోదేశాలలో వ్యాపించింది. అతడు నిర్మించిన గోపురాలు చూడటానికి, ఎంతోమ ది సమర్థులైన శిల్పులే యాత్రలు చేస్తూవుంటారు.

ఇదివరకు తాను నిర్మించిన దేవాలయాలన్నిటికన్న అత్యంత సుందరంగా, ఆలయాన్నీ, ఇదివరకటి గోపురాలకన్న అత్యంత మనోహరంగా గోపురాలనూ నిర్మించడానికీ ఆ రాజుదగ్గర ఆ శిల్పి శపథం చేశాడు.